క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

కల్వకుర్తి: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబాన్ని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం మంగళవారం పరామర్శించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే సోదరుడు శశివర్ధన్ రెడ్డి మృతి చెందటంతో భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఓదార్చారు. అదేసమయంలో ఎమ్మెల్సీ కవిత రావడంతో మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు ఉన్నారు.

విద్యార్థులు నివాళి



తాడూరు: మండలంలోని అల్లాపూర్, మేడిపూర్ పాఠశాల విద్యార్థులకు ఏడేళ్లుగా అల్పాహారం అందించిన దాత జంగిరెడ్డి మృతికి ఆయా పాఠశాలల విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. మేడిపూర్‌లోని సాయిరాం ట్రస్టు సభ్యుడైన జంగిరెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మౌనం పాటించారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ

తాడూరు: నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ గంగమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని గుంతకోడూరు, అల్లాపూర్ గ్రామాల్లోని నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వచ్చే జూన్ నెలవరకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

ఊర్కొండ: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

లింగాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు డి.జ్యోతిని మంగళవారం పాఠశాల ఆవరణలో ఎంఈఓ చంద్రుడు ఘనంగా సన్మానించారు. ఈ నెల 7న హైదరాబాద్ సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఉపాధ్యాయురాలిని మంత్రి సీతక్కనుంచి సన్మానం పొందడంపై సంతోషం వ్యక్తం చేశారు. హెచ్ఎం పర్వతాలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

తాడూరు: వివిధ రకాల వాహనాల చలాన్లపై ప్రభుత్వం ఇచ్చిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ రామన్‌గౌడ్ తెలిపారు. మంగళవారం వాహనాల తనిఖీలో భాగంగా నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, త్రిబుల్ రైడింగ్, మైనర్ రైడింగ్ వాహనాలను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వాహనంపై చలాన్లు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసు నమోదు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఎక్సైజ్ దాడులు



అచ్చంపేట రూరల్: నిషేధిత నాటుసారా కాచినా, సరఫరా చేసినా చర్యలు తప్పవని ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి సుధాకర్, అచ్చంపేట సీఐ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రంగాపూర్‌లో ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. 750 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి పారబోశారు. 15లీటర్ల నాటుసారా, 30 కేజీల నల్లబెల్లం, 40 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. సైదమ్మ, శాంతి, నిరంజన్ అనే ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ పరమేష్, బాలరాజు, సతీష్‌కుమార్, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లేష్



మన్ననూర్: నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా అమ్రాబాద్ మండలానికి చెందిన గోలి మల్లేష్, గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు కృష్ణయ్య, రాములు, సురేష్, రామకృష్ణ, శేఖర్, రవి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వారు పేర్కొన్నారు.

కనీస వసతులు కరువు

- రోడ్డు, విద్యుత్ సౌకర్యం లేక అవస్థలు
- కండ్లకుంట గ్రామస్తులకు తప్పని తిప్పలు



అడవి ప్రాంతంలో కండ్లకుంట గ్రామం

అమ్రాబాద్: మండలంలోని కండ్లకుంటలో కనీస వసతులు లేక గ్రామస్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం జోత్యనాయక్‌తండా గ్రామ పంచాయతీలో పరిధిలో కండ్లకుంట గ్రామం ఉంది. గ్రామంలో విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. మౌలిక వసతులు కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని స్థానికులు వాపోయారు. గ్రామంలో ఉన్న భూములు కూడా కోర్టు పరిధిలో ఉండటంతో సాగు చేసేందుకు వీలులేకపోవడంతో ఇతర గ్రామాలకు కూలీ చేసేందుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆరు కిలోమీటర్ల కాలినడకన వెళ్లి కూలీ పనులు చేసి ఇంటికి వస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

తడకల గుడిసెలే దిక్కు

గ్రామంలో ఇంత వరకు పక్కా ఇండ్లు నిర్మించలేదు. ఇప్పటివరకు గ్రామస్తులు పూరి గుడిసెలు, తడికల గుడిసెలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం, చలికాలంలో వారి బాధలు చెప్పనక్కర్లేదు. ఇళ్లమధ్యనే పిచ్చిమొక్కలు, చెట్లు దట్టంగా అలుముకున్నా అధికారులు చూసిచూనట్లు వ్యవహరిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేక పోవడం రాత్రివేళ్లలో చీకట్లోనే కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం పరిసరాలలో ఉన్న పాములు, తేళ్లు, ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. రోజురోజుకు బిక్కుబిక్కుమంటూ జీవితాలు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు సౌకర్యం లేక..

గ్రామం నుంచి మండల కేంద్రం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. 2012లో మట్టిరోడ్డును నిర్మించారు. నామమాత్రంగా చేయడం మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. అడుగుగడుగన రాళ్లు ఉండటంతో వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అడవి మార్గంలో రెండు కిలో మీటర్ల మేర రాళ్లు తేలి ఉన్నాయి. ప్రస్తుతం 108 అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు.

పక్కా ఇళ్లు నిర్మించాలి

గ్రామంలో పక్కా ఇళ్లు నిర్మించాలి. గుడిసెలలోకి విషపురుగులు ప్రవేశిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో భయాందోళన చెందుతున్నాం. రోడ్డు సౌకర్యం లేక కూలీలకు వెళ్లలేక పోతున్నాం. గ్రామానికి వాహన రాకపోకలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు సమస్యలు పరిష్కరించాలి. -జంగయ్య, కండ్లకుంట

సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా. రోడ్డు మరమ్మతు చర్యలు తీసుకుంటా. త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. మట్టిరోడ్డును చదునుచేసేందుకు నిధుల కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తా.
– రాము, సర్పంచ్, జోత్యనాయక్‌తాండా

ఆర్టీసీ ఉద్యోగులకు వనభోజనం



కొల్లాపూర్‌లో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బంది



అచ్చంపేటలో

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఉద్యోగులకు మంగళవారం డిపో ఆవరణలో వన భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మహిళా, పురుషుకుల వివిధ పోటీలు పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఉద్యోగులు ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన వారికి డీఎంఉమాశంకర్, డిప్యూటీ ఆర్ఎం శ్యామల బహుమతులు అందజేశారు. అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయం నెలకొల్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమాల్లో రంజిత్‌కుమార్, నజీర్, గోవర్ధన్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, ప్రవీణ్‌కుమార్, రామయ్య యాదవ్, అయూబ్, నదీమ్, గౌస్, ఖాజామైనోద్దీన్, శ్రీదేవి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ కార్మికుల్లో మానసిక ఉల్లాసం పెంపొందించేందుకే వన భోజనాలు, క్రీడలు, చిట్ చాట్‌లు దోహదం చేస్తాయని డిపో మేనేజర్ మురళి దుర్గ ప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉద్యోగులకు వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫ్, స్పెషల్ ఆఫ్, ఇన్ కమింగ్‌లో ఉన్న డ్రైవర్, కండక్టర్లతో పాటూ మెకానిక్‌లంత ఒక చోట కలిసి ఆనందోత్సవంగా ఆట, పాటలు, సహపంక్తి భోజనాలు చేశారు. ఆట పాటలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్మిక నాయకులు జీఆర్‌రెడ్డి, బాలాజీ, ఇందిరమ్మ, సీఐ పీఎస్ దేవి, ఎంఎఫ్ కృష్ణయ్య, రత్నమ్మ, జేఆర్‌రెడ్డి, మోహన్ లాల్, ఏజేరెడ్డి, నాగన్న గౌడ్, టీఆర్సీ రెడ్డి, అమృనాయక్, మల్లయ్య, నిరంజన్, జంగమ్మ, యాదమ్మ, శంకర్, లక్ష్మి, రేణమ్మ, అలివేల, అనిత పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షతలు పంపిణీ



వెల్దండ మండలం నారాయణపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కోడేరులో

లింగాల: మండలంలోని రాయవరంలో అయోధ్య రాముడి అక్షతలను మంగళవారం ఇంటింటికి పంపిణీ చేశారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయంలో అక్షతలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ నామస్మరణ మార్మోగింది. గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి గడపగడపకు అక్షతలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, తిర్పతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో అయోధ్య శ్రీరామ అక్షతలను ఆ ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమాపతి ఆచార్యులు, రామకృష్ణ, బాబుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో అక్షతలను గడప గడపకు పంపిణీ చేశారు. శ్రీరాముని చిత్ర పటంతో ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జంగం శివయ్య, బాలపీరు, రామకృష్ణ, శేఖర్, చంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌లో అయోధ్య రాముడి అక్షతలను ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. యువకులు ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ శాంతి, మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, నాయకులు శ్రీను, చిన్న, శ్రీనునాయక్, రవి, నర్సింహ్మా, నరేష్ ఉన్నారు.

కొనసాగుతున్న ఆధార్ నమోదు

మన్ననూర్: ఆదివాసి చెంచులందరికి ఆధార్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని ఉద్దేశ్యంతో కలెక్టర్ ఉదయ్ కుమార్ ఆదేశాల మేరకు మన్ననూర్‌లోని రైతు వేదిక భవనంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని మన్ననూర్, అమ్రాబాద్, పదర, బల్మూర్, లింగాల, కొల్లాపూర్‌లలో చెంచులు నుంచి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం నల్లమల లోతట్టు ప్రాంతంలోని సార్లపల్లి, కుడిచింతలబైలు, మల్లాపూర్, ఫరహాబాద్ చెంచు గ్రామాలు, పెంటలనుంచి చెంచులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆధార్ నమోదు చేసుకున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెలలో కల్యాణ లక్ష్మి చెక్కును లబ్ధిదారుడి కుటుంబానికి వార్డు సభ్యుడు కె రవిగౌడ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు పాండురంగారెడ్డి, రవి, శ్యాంసుందర్ రెడ్డి, మహేశ్, మల్లయ్య, భీరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయినా తప్పని తిప్పలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం



గ్రామపంచాయతీలో కొనసాగుతున్న పాఠశాల

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురులో ఏడాది కిందట మన ఊరు మన బడి పథకంలో భాగంగా పాత పాఠశాలలు కూల్చి వేసి కొత్త పాఠశాల గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. ముమ్మరంగా పనులు చేయడంతో ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తయ్యింది. కాని ప్రారంభానికి నోచుకోకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న గ్రామ పంచాయతీ భవనంలో అరకొర వసతుల నడుమ పాఠశాల కొనసాగుతోంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

మంత్రులకు సన్మానం

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్‌లను మంగళవారం కళాకారులు సన్మానించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళాభవన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జానపద కళాకారులు వారిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కళాకారులందరికీ పింఛన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు జానపద ప్రదర్శనలో పాల్గొన్నారు. యాదగిరి, భాస్కర్, నరహరి, పర్వతాలు, సుభాష్, కుమార్, సహదేవుడు, లక్ష్మీనరసింహా, వెంకటేష్, నర్సింహులు తరలివెళ్లారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా జూపల్లి వెంకటయ్య యాదవ్

చారకొండ: నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య యాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్, ఎంపీటీసీగా మండలంలోని వివిధ బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం వెంకటయ్య యాదవ్ ఎంతో కృషి చేశారని వివరించారు. అనంతరం డీసీసీ ఉపాధ్యక్షుడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు పలువురు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం



వెల్దండ: పేద విద్యార్థులకు అండగా ఉంటామని ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లాలు నాయక్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొల్లంపల్లి ఉన్నత పాఠశాలల్లో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంలో పాఠ్యాపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్, నాయకులు బ్రహ్మచారి, రామకృష్ణ, వెంకట్‌రావు, మధు, మల్లేష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఏకమవుదాం

అచ్చంపేట రూరల్: సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగులు ఏకమవ్వాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకుడు నాగయ్యగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని టీఎంయూ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈనెల 12న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు యూనియన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర నాయకుడు అశ్వత్థామ రెడ్డి, పలువురు హాజరవుతారని తెలిపారు.

న్యాయం చేయాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం: పెద్దకొత్తపల్లి మండలం వావిళ్లబావి సమీపంలో సోమవారం ఆటో ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ఘటనలో చంద్రకల్ గ్రామానికి చెందిన దంపతులు హుసేన్, హసీనా అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై బాధిత కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేందర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని అన్ని విధాలా న్యాయం చేస్తామని ఆందోళనకారులకు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తాం



చదివిన గదిని చూయిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలలను ఆయన సందర్శించారు. అదనపు బాత్‌రూం గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. విద్యార్థినీ, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లాలోనే మోడల్ కళాశాలగా తీర్చిదిద్దుతానన్నారు. రూ. కోటి వ్యయంతో కళాశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, మెరుగైనా ఫలితాలు సాధించాలని కోరారు.

నేను పూర్వ విద్యార్థినే..

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో ముచ్చటించే క్రమంలో తాను కూడా ఇదే కళాశాల(అప్పటి జూనియర్ కళాశాల)లో చదివానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ జ్ఞాపకాలను గుర్తు చేశారు. అప్పట్లో తాను కూర్చున్న గది, ప్రిన్సిపాల్ గదిని చూసి జ్ఞాపకం చేసుకున్నారు. పక్కనే ఉన్న ఎమ్మెల్యే క్లాస్‌మేట్లు కట్ట అనంతరెడ్డి, నర్సింహారావుతో కాసేపు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంబురపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు గౌరీశంకర్, సోమ్లానాయక్, ప్రిన్సిపాల్స్ ప్రభువర్ధన్‌రెడ్డి, సైదులు, లెక్చరర్లు నాగరాజు, మల్లిఖార్జున్, కాంగ్రెస్ నాయకులు వై. శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, అనంతరెడ్డి, నర్సింహారావు, రామనాథం, శరత్‌గౌడ్, రఘురాం, రాజేందర్, చంద్రశేఖర్, ఖాదర్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



కల్వకుర్తిరూరల్: మండలంలోని కురుమిద్దెలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దామోదర్ గౌడ్, రవి, సత్యసాయి సేవా సమితి బాధ్యులు లక్ష్మణ్, మయూరి వేణు, శ్రీను, పోల శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టవర్ ఏర్పాటు చేయొద్దని నిరసన

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో ఇళ్ల మధ్య టవర్‌ను ఏర్పాటు చేయొద్దని మంగళవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నివాసాల మధ్య సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తే అనారోగ్యాలబారిన పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఓ సెల్‌ఫోన్ కంపెనీకి చెందిన టవర్‌ను ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. గ్రామస్తుల ఆరోగ్యం దృష్ట్యా సంబంధిత అధికారులు ఇతర ప్రాంతంలో టవర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

తెలకపల్లి: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సాధికారత కేంద్ర బృందం సునీత, అనితలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల ప్రాముఖ్యం, వారిపై జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్యవివాహాలు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు వివరించారు. చదువుతోనే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలస్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయ ఆవరణలో మంగళవారం పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 35 మంది మహిళలు పాల్గొని ముగ్గులను ఆకర్శనీయంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు వజ్రమ్మ, అనురాధ, శోభ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మొదటి బహుమతి గుజ్జరి కీర్తి, ద్వితీయ బహుమతి కుకుడాల లావణ్య, మూడో బహుమతి వనం కవిత అందుకున్నారు. పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు కర్నాటి నిర్మల, చిలువేరు శ్రావణి, వనం సరిత, గుర్రం హైమావతి, గంజి నిర్మల, కుకుడాల నారాయణమ్మ, క్యామ తిరుపతమ్మ, వనం గీత, దాసు బాలకిష్టమ్మ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

కొల్లాపూర్: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కే పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ఆయన అవగాహన కల్పించారు. సుస్థిర అభివృద్ధి, పర్యావరణ అనుకూల జీవనశైలి గూర్చి వివరించారు. పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్ రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్, కన్వీనర్ దేవరాజ్ తదితరులున్నారు.

13న వాలీబాల్ టోర్నమెంట్

కోడేరు: మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం సెల్: 8466864290, 7036968486 నంబర్లను సంప్రదించాలని కోరారు.

14 నుంచి మహబూబ్ సుభానీ ఉర్సు

చారకొండ: మండలంలోని మర్రిపల్లి తండా బోడబండపై ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మహబూబ్ సుభానీ షరీఫ్ ఉత్సవాలు నిర్వహిస్తునట్లు దర్గా కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న గంధోత్సవం, 15న కందుర్, దీపారాధన, 16న ఖతం ఖురాన్, రాత్రి ఫతేహా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రుడు, సంఘం రాష్ట్ర బాధ్యులు పురుషోత్తం, తాహెర్‌పాషా, అంజిలాల్ పాల్గొన్నారు.

సీతారాములకు పుష్పాభిషేకం



కొల్లాపూర్: పట్టణంలోని రామమందిరంలో సీతారాముల విగ్రహాలకు మంగళవారం పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు రాఘవేంద్రాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

వివాహిత మృతి

మన్ననూర్: మూర్ఛ వ్యాధితో బాధపడుతూ వివాహిత మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి అమ్రాబాద్ మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు వివరాల ప్రకారం స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన స్వాతి(28) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. సోమవారం కూడా ఫిట్స్ రావడంతో గమనించిన కుటుంబసభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదబాద్‌బాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం అమ్రాబాద్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని భర్త ఎనుపోతుల కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలికు భర్తతో పాటూ ఏడాది కూతురు ఉంది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.